సాక్షి కరీంనగర్

శుక్రవారం । 26 । జూలై । 2024

ఎల్ఎండీని సందర్శించిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు

ఎల్ఎండీ జలాశయాన్ని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, పార్టీ రాష్ట్ర నాయకులు పరిశీలించారు. కాళేశ్వరం లిఫ్ట్ చేయకుండా పంట పొలాలను కాంగ్రెస్ ప్రభుత్వం ఎండబెట్టిందని, అందుకే లోయర్ మానేరు డ్యాం, మిడ్ మానేరు సహా ఎండిపోయిన ప్రాజెక్టులు పరిశీలించేందుకే తాము పర్యటిస్తున్నట్లు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ వెల్లడించారు.

- వివరాలు మెయిన్‌లో..



న్యూస్‌రీల్

సంప్రదాయ విద్య నేర్పించాలి

- శ్రీకృష్ణ యతీంద్రుల పరమపదోత్సవంలో చినజీయర్‌స్వామి



మాట్లాడుతున్న చినజీయర్‌స్వామి

కరీంనగర్ కల్చరల్: ప్రతీ వ్యక్తి సత్సంప్రదాయం పాటిస్తూ, దేవ, పితృ, ఋషి రుణం తీర్చుకోవాలని, పిల్లల్లో ఒక్కరిని సంప్రదాయ విద్య వైపునకు వెళ్లేలా చూడాలని త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన జీయర్ స్వామి పిలుపునిచ్చారు. ఇటీవల కరీంనగర్‌లో పరమపదించిన శ్రీకృష్ణ యతీంద్ర రామానుజ జీయర్ స్వామి పరమపదోత్సవానికి స్వామిజీ హాజరై మాట్లాడారు. సంప్రదాయ, ఆచార్య పరంపరలను జలధారలా కొనసాగిస్తూ భగవత్పాదాలపై నిత్యం ధ్యానం నిలపాలని, అప్పుడే ఇహపర సుఖాలు సాధ్యమని పేర్కొన్నారు. అహోబిల రామానుజ జీయర్ స్వామి మాట్లాడుతూ, పరమపదం చేరిన స్వామిజీకి తమకు గతంలో సన్నిహిత సంబంధం ఉందన్నారు. స్వామిజీ పూర్వాశ్రమ కుమారులు డాక్టర్ శ్రీమన్నారాయణాచార్యులు, జగన్నాథాచార్యులు, సింహాద్రి, కె.రామకృష్ణ, పండితులు నేపాల్ కృష్ణమాచార్యులు, నంబి వేణు గోపాలాచార్యులు, గోవర్ధనగిరి జగన్నాథాచార్యులు, గోవర్ధనగిరి అనంతాచార్యులు, నమిలకొండ రమణాచార్యులు, కలకుంట్ల వేదాంతాచార్యులు, కేఏస్ అనంతాచార్యులు, డాక్టర్ కె.వరప్రసాదాచార్యులు, వికాస తరంగిణి బాధ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పెండింగ్ కేసులపై దృష్టి సారించాలి

- సీపీ అభిషేక్ మహంతి



రికార్డులు పరిశీలిస్తున్న సీపీ అభిషేక్ మహంతి

హుజూరాబాద్: పెండింగ్ కేసులపై దృష్టిసారించాలని సీపీ అభిషేక్ మహంతి సూచించారు. హుజూరాబాద్ ఏసీపీ కార్యాలయాన్ని గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. పెండింగ్ కేసులు త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. రౌడీ షీటర్లు, హిస్టరీ షీటర్లపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి, వారి కదలికలను గమనించాలన్నారు. నూతన చట్టాలు అమలు జరిగేలా చూడాలన్నారు. సైబర్ నేరాల బారిన పడకుండా డివిజన్ పరిధిలోని ప్రజల్లో అవగాహన పెంచాలన్నారు. పెండింగ్ వారెంట్లు అమలు చేయాలన్నారు. హుజూరాబాద్ ఏసీపీ శ్రీనివాస్‌జీ తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్‌లో ఇచ్చింది సున్నా

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు కృష్ణారెడ్డి
- తెలంగాణచౌక్‌లో ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం



దిష్టిబొమ్మ దహనం చేస్తున్న బీజేపీ నేతలు కృష్ణారెడ్డి, రాంగోపాల్‌రెడ్డి, తదితరులు

కరీంనగర్‌టౌన్: జిల్లా అభివృద్ధిని కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించిందని, రాష్ట్ర బడ్జెట్‌లో ఎలాంటి నిధులు కేటాయించలేదని బీజేపీ జిల్లాశాఖ ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం తెలంగాణచౌక్‌లో రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేశారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ అంకెల గారడీలా కనిపిస్తోందని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన నియోజకవర్గానికి రూ.4,200 కోట్ల పైచిలుకు నిధులు కేటాయించుకుంటే, కరీంనగర్ జిల్లాకు ఆ విధంగా ఎందుకు నిధులు కేటాయించడం లేదని ప్రశ్నించారు. జిల్లా అభివృద్ధిపై కాంగ్రెస్ నేతలకు చిత్తశుద్ధి లేదన్నారు. పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కోమటిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శులు తాళ్లపల్లి శ్రీనివాస్‌గౌడ్, మాడ వెంకటరెడ్డి, బత్తుల లక్ష్మీనారాయణ, పార్లమెంట్ కన్వీనర్ బోయిన్‌పల్లి ప్రవీణ్‌రావు, కళ్లెం వాసుదేవరెడ్డి, రాపర్తి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఈఈ మహేందర్ బదిలీ

కరీంనగర్ కార్పొరేషన్: నగరపాలకసంస్థ ఈఈ మహేందర్ వరంగల్ కార్పొరేషన్‌కు బదిలీ అయ్యారు. ప్రస్తుతం మహేందర్ ఇన్‌చార్జి ఎస్‌ఈగా ఉన్నారు. కాగా ఇప్పటికే ఈఈగా బదిలీపై వచ్చిన రాజ్‌కుమార్‌కు ఎస్‌ఈగా బాధ్యతలు అప్పగించారు.

సంక్షేమానికి భరోసా



చెరుకు రైతులకు తీపి కబురు..

ముత్యంపేట షుగర్ ఫ్యాక్టరీ రీ ఓపెన్‌కు హామీ

- చేనేత కార్మికులకు ఆర్డర్లు ఇస్తామని ప్రకటన
- మెడికల్ కాలేజీ సిబ్బంది, సదుపాయాలకు పచ్చజెండా
- మహిళా సంఘాలకు రూ.10 లక్షల జీవిత బీమా
- రైతు కూలీలకు రూ.12 వేలు
- ఇందిరమ్మ ఇళ్లపై కొత్త ఆశలు
- కొత్తపల్లి–మనోహరాబాద్ రైల్వేలైన్‌కు నిధులపై స్పష్టత లేదు
- కానరాని 'దళితబంధు' ప్రస్తావన



సాక్షి ప్రతినిధి, కరీంనగర్:

కాంగ్రెస్ ప్రభుత్వం తన తొలి బడ్జెట్‌లో సంక్షేమానికి పెద్దపీట వేసింది. ముత్యంపేట షుగర్ ఫ్యాక్టరీ తెరిపించడం, మహిళా సంఘాలకు రూ.10 లక్షల బీమా, మెడికల్ కాలేజీల్లో సదుపాయాలు, ఇందిరమ్మ ఇళ్లు, రైతుకూలీలకు పెట్టుబడి సాయం, ఆరు గ్యారంటీల అమలుకు కట్టుబడి ఉంటామని స్పష్టం చేసింది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పలు వర్గాల సంక్షేమానికి ప్రాధాన్యం ఇచ్చింది. ముత్యంపేట నిజాం షుగర్స్ ఫ్యాక్టరీ రూ.250 కోట్ల మొండి బకాయిల్లో ఇటీవల రూ.43 కోట్లు చెల్లించగా.. మిగిలిన రూ.203 కోట్లు త్వరలోనే చెల్లిస్తామని ప్రకటించింది. త్వరలో పరిశ్రమను తెరిపిస్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రకటించడంపై హర్షం వ్యక్తమవుతోంది.



రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకుడు నరేందర్‌రెడ్డి, తదితరులు

చేనేత ఆర్డర్లు సాకారమయ్యేనా?



సిరిసిల్ల చేనేత కార్మికులకు బడ్జెట్‌లో ప్రభుత్వం శుభవార్త చెప్పింది. పాఠశాలల యూనిఫామ్స్, ఆస్పత్రి బెడ్ షీట్లు తదితర ఆర్డర్లు ఇస్తామని ప్రకటించింది. అయితే, ప్రస్తుతం సిరిసిల్లో చేనేత కార్మికుల సంఖ్య చాలావరకు తగ్గిపోయింది. 176 మగ్గాలపై సుమారు 50 మంది మాత్రమే పని చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం బడ్జెట్‌లో పెట్టిన ప్రతిపాదన ఏ మేరకు ఉపయోగపడుతుందన్నది ప్రశ్నార్థకంగా మారింది. ఈరోజు వరకు సిరిసిల్లలో పవర్‌లూమ్స్ 26 వేలు ఉండగా, 10 వేల మంది కార్మికులు ఉపాధి పొందుతున్నారు. ప్రభుత్వ ఆర్డర్లు ఎప్పటిలాగే ఉన్నాయి.

వైద్య రంగం



ఉమ్మడి జిల్లాలో సిరిసిల్ల, కరీంనగర్, జగిత్యాల, రామగుండం మెడికల్ కాలేజీలున్నాయి. వీటిలో సిరిసిల్ల 100 సీట్లు, 300 పడకలు, కరీంనగర్ 100 సీట్లు, 500 పడకలు, రామగుండంలో 150 సీట్లుండగా, 330 పడకలు, జగిత్యాలలో 150 సీట్లు, 330 పడకలతో వైద్య సేవలందిస్తున్నాయి. వీటన్నింటికీ భవనాలు, మౌలిక సదుపాయాలు, బోధన, బోధనేతర సిబ్బంది కొరత ఉంది. అన్ని సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తామని ప్రకటించడాన్ని స్వాగతిస్తున్నారు.

ఇందిరా జీవిత బీమా పథకం..

ఉమ్మడి జిల్లాలో స్వయం సహాయక సంఘాల్లో 5 లక్షల మందికి పైగా సభ్యులున్నారు. వీరికి ఇందిరా జీవిత బీమా పథకంలో భాగంగా రూ.10 లక్షల బీమా కల్పిస్తున్నట్లు ప్రకటించడంతో సభ్యులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

దళితబంధు అటకెక్కినట్లేనా?

ఈ బడ్జెట్‌లో దళితబంధు పథకం ప్రస్తావన లేకపోవడం చర్చనీయాంశంగా మారింది. గత ప్రభుత్వం హుజూరాబాద్‌లో పైలెట్ ప్రాజెక్టుగా 18 వేలకు పైగా కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున లబ్ధి చేకూర్చింది.

రైతు కూలీలు..



ఉమ్మడి జిల్లాలో వేలాది మంది రైతు కూలీలు ఉన్నారు. వీరు భూములను కౌలుకు తీసుకొని, పంటలు సాగు చేసుకుంటున్నారు. గత ప్రభుత్వం రైతు కూలీలకు ఆర్థిక సాయం ఇవ్వబోమని చెప్పింది. కాంగ్రెస్ ప్రభుత్వం తాజా బడ్జెట్‌లో రూ.12 వేలు ఇస్తామని ప్రకటించడంతో వారు సంతోషిస్తున్నారు.

ఇందిరమ్మ ఇళ్లు..

నియోజకవర్గానికి 3,500 చొప్పున ఉమ్మడి జిల్లాలోని 13 నియోజకవర్గాల్లో 45,500 మందికి ఇళ్లు దక్కనున్నాయి. 400 చదరపు గజాలతో వంట గది, మరుగుదొడ్డి ఉండేలా వీటిని నిర్మించనున్నారు. నిర్మాణానికి రూ.5 లక్షలు ఇస్తారు. అలాగే, గత ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లను త్వరలోనే పంపిణీ చేస్తామని ప్రకటించారు.

పంపిణీ చేయాల్సిన 'డబుల్' ఇళ్లు..

జగిత్యాల జిల్లాలో 4,580, కరీంనగర్ జిల్లాలో 6,776, పెద్దపల్లి జిల్లాలో 2,040, రాజన్నసిరిసిల్ల జిల్లాలో 309 డబుల్ బెడ్‌రూం ఇళ్లు పంపిణీ చేయాల్సి ఉంది.

సాగునీటి రంగం..



జగిత్యాలలో వరద కాలువకు రూ.265.21 కోట్లు, శ్రీపాద ఎల్లంపల్లికి రూ.349.66 కోట్లు కేటాయించింది. కరీంనగర్ ఇరిగేషన్ ఇంజినీర్ ఇన్ చీఫ్ కార్యాలయానికి రూ.57.24 కోట్లు, జగిత్యాల ఇరిగేషన్ ఇంజినీర్ ఇన్ చీఫ్ కార్యాలయానికి రూ.51.65 కోట్లు కేటాయించింది.

కొత్తపల్లి–మనోహరాబాద్ లైన్..



కరీంనగర్–హైదరాబాద్ రైల్వేలైన్ ప్రతిష్టాత్మకం. దీనికి ఇటీవల కేంద్రం ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో రూ.350 కోట్లు ప్రకటించగా.. రాష్ట్రప్రభుత్వం తన వాటాగా రూ.112 కోట్లు ఇవ్వాల్సి ఉంది. అయితే తాజా రాష్ట్ర బడ్జెట్లో కొత్త రైల్వేలైన్లకు రూ.70 కోట్లు కేటాయించినా.. ఈ రైల్వేలైన్‌కు ఎన్నినిధులు కేటాయించారనేదానిపై స్పష్టత ఇవ్వలేదు. చీర్లవంచ వద్ద మిడ్‌మానేరులో నిర్మించతలపెట్టిన రైల్ కమ్ రోడ్ బ్రిడ్జి రద్దయినట్లేనని సమాచారం.

వేములవాడకు రూ.50 కోట్లు

వేములవాడ టెంపుల్ డెవలప్‌మెంట్ ఏరియా అథారిటీ (వీటీడీఏ)కు ప్రభుత్వం రూ.50 కోట్లు కేటాయించింది. ఆలయాభివృద్ధి కోసం కట్టుబడి ఉంటామని ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ నాయకులు చేసిన వాగ్దానాన్ని తాజాప్రకటనతో నెరవేర్చుకున్నారు. ఆలయ పరిసరాల్లో ఇప్పటికే రోడ్డు విస్తరణ పనులు నడుస్తున్నాయి. తాజా కేటాయింపులతో ఆలయ పరిసరాలు సుందరంగా మారనున్నాయి.

ప్రజలను మోసం చేశారు



రాష్ట్ర బడ్జెట్ అన్నివర్గాల ప్రజలను మోసం చేసే విధంగా ఉంది. కరీంనగర్ మానేరు రివర్ ఫ్రంట్, తదితర ప్రాజెక్టులకు నిధులు కేటాయించలేదు. వ్యవసాయం, పారిశ్రామిక, ఐటీ, పేదవర్గాలను గురించి ఆలోచించలేదు. రైతులను పొగిడినట్లే పొగుడుతూ.. వెన్నుపోటు పొడిచారు. కాంగ్రెస్ పార్టీ గొప్పలు చెప్పుకోవడానికి ప్రయత్నించినట్లుగా బడ్జెట్ ప్రసంగం ఉంది. – గంగుల కమలాకర్, ఎమ్మెల్యే, కరీంనగర్

బడ్జెట్ బాగుంది



బడ్జెట్ అన్నివర్గాలకు ఆమోదయోగ్యంగా ఉంది. ఎన్నికల హామీల అమలుకు దశలవారీగా నిధులు కేటాయించే ప్రక్రియకు శ్రీకారం చుట్టాం. వ్యవసాయం, విద్య, మహిళా, మైనార్టీల సంక్షేమానికి పెద్దపీట వేయడం కాంగ్రెస్ చిత్తశుద్ధికి నిదర్శనం. ప్రజల జీవన ప్రమాణాలు పెంపొందించడమే లక్ష్యంగా రూపొందిన బడ్జెట్ అన్నివర్గాలకు వరం.

– మేడిపల్లి సత్యం, ఎమ్మెల్యే ,చొప్పదండి

రాష్ట్ర ప్రభుత్వం కరుణించింది



కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ కేటాయింపు విషయంలో తెలంగాణ ప్రజలను వంచించినా, రాష్ట్ర ప్రభుత్వం కరుణించింది. అన్ని వర్గాల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ఆయావర్గాలకు అత్యధిక నిధులు కేటాయించడం హర్షణీయం. వ్యవసాయం, విద్య, మహిళా, మైనార్టీ సంక్షేమానికి పెద్దపీట వేసిన సీఎం రేవంత్‌రెడ్డికి, మంత్రివర్గానికి మానకొండూర్ ప్రజల తరఫున కృతజ్ఞతలు.

– కవ్వంపల్లి సత్యనారాయణ, ఎమ్మెల్యే, మానకొండూర్

జనరంజకం



రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన బడ్జెట్ జనరంజకంగా ఉంది. మహిళా, బీసీ, ఎస్సీ, మైనార్టీ సంక్షేమానికి పెద్దపీట వేశారు. వ్యవసాయరంగంతో పాటు గ్రామీణాభివృద్ధికి అధిక నిధులు కేటాయించడం హర్షణీయం. గృహజ్యోతి, గ్యాస్ సబ్సిడీకి నిధులు కేటాయించారు. మొత్తంగా అన్ని వర్గాలకు జనరంజకంగా ఈ బడ్జెట్ ఉంది.

– కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, సుడా చైర్మన్

రైతు పక్షపాత ప్రభుత్వం



రాష్ట్ర బడ్జెట్‌తో కాంగ్రెస్ ప్రభుత్వం రైతు పక్షపాతి అని రుజువైంది. రైతును రాజు చేయడమే లక్ష్యంగా వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యం ఇచ్చింది. వ్యవసాయరంగానికి రూ.72,659 కోట్లు కేటాయించడం రైతులపై మా ప్రభుత్వానికి ఉన్న ప్రేమకు నిదర్శనం. అన్ని వర్గాల ప్రజలకు మేలు జరిగేలా బడ్జెట్ ప్రవేశపెట్టడం అభినందనీయం.


– వెలిచాల రాజేందర్‌రావు, కాంగ్రెస్ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి

విద్యారంగానికి నిరాశే



బడ్జెట్‌లో విద్యారంగ కేటాయింపులు నిరాశ పరిచాయి. రూ.21,292కోట్లే కేటాయించారు. ఉమ్మడి రాష్ట్రంలో 2014-15లో 11శాతం కేటాయింపులు ఉంటే ప్రత్యేక రాష్ట్రంలో తక్కువగా కేటాయిస్తున్నారు. పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలు, పీఆర్సీ గురించి ప్రస్తావించలేదు. తక్షణమే విద్యారంగానికి 20శాతానికి తగ్గకుండా నిధులు కేటాయించాలి.

– ఎం.రఘుశంకర్‌రెడ్డి, డీటీఎఫ్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు





కంపాక్టర్‌ను వినియోగంలోకి తేవాలి

- ఇన్‌చార్జి కమిషనర్ ప్రఫుల్ దేశాయ్



కంపాక్టర్ బిన్‌ను పరిశీలించి అధికారులకు ఆదేశాలిస్తున్న ప్రఫుల్ దేశాయ్

కరీంనగర్‌కార్పొరేషన్: మూడు రోజుల్లోగా చెత్తను తగ్గించే కంపాక్టర్ బిన్‌ను వినియోగంలోకి తీసుకురావాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, ఇన్‌చార్జి కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ అధికారులను ఆదేశించారు. గురువారం నగరంలోని హౌసింగ్‌బోర్డుకాలనీలో ఉన్న డీఆర్సీ సెంటర్, పోర్టబుల్ కంపాక్టర్‌స్టేషన్, కంపోస్టింగ్ యూనిట్‌ను సందర్శించారు. చెత్తను కుదించే కంపాక్టర్ మిషన్ వృథాగా ఉండడం, డీఆర్సీ సెంటర్ అధ్వానంగా ఉండడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. 15 ట్రాక్టర్ల చెత్తను కుదించి ఒకే ట్రాక్టర్‌స్థాయికి చేర్చే లక్షల విలువైన కంపాక్టర్ మిషన్‌ను వెంటనే వినియోగంలోకి తీసుకురావాలన్నారు. డీఆర్సీ సెంటర్‌లో మరమ్మతులు చేపట్టాలని, స్వచ్ఛఆటోలు విధిగా తడిచెత్తను కంపోస్టింగ్ యూనిట్‌కు తీసుకురావాలని సూచించారు. వారం రోజుల్లో ఈ సమస్యలు పరిష్కారం కావాలని లేనట్లయితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇన్‌చార్జి ఎస్‌ఈ మహేందర్, పర్యావరణ ఇంజినీర్ స్వామి, ఏఈ వాణి ఉన్నారు.

నర్సరీలు పరిశీలన

నగరంలోని బుల్‌సెమన్ సెంటర్, ఎల్ఎండీ కాలనీలోని నర్సరీలను ఇన్‌చార్జి కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ సందర్శించారు. వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటేందుకు సరిపడా నర్సరీల్లో పెంచుతున్నారా అని ఆరా తీశారు. ఎవెన్యూ, బ్లాక్ ప్లాంటేషన్‌లలో మీటర్ కన్నా ఎక్కువ ఎత్తుగల మొక్కలనే నాటాలని సూచించారు. ఫిల్టర్‌బెడ్ ఎదురుగా ఉన్న బ్లాక్ 6లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని పరిశీలించారు. స్వయంగా మొక్కను నాటారు. ఎస్‌ఈ మహేందర్, డీఈలు ఓంప్రకాశ్, లచ్చిరెడ్డి, ఏఈ వాణి తదితరులు పాల్గొన్నారు.

రెడ్డి సంఘం జిల్లా అధ్యక్షుడిగా మధుసూదన్ రెడ్డి



మధుసూదన్‌రెడ్డి

కరీంనగర్‌టౌన్: ఆలిండియా రెడ్డి సంఘం జిల్లా అధ్యక్షుడిగా రామడుగు మండలం గోపాలపేట గ్రామానికి చెందిన ఎడవెల్లి మధుసూదన్ రెడ్డిని నియమించినట్లు ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు బీరెడ్డి కరుణాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి చిట్‌రెడ్డి మల్లారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. తన నియామకానికి సహకరించిన రెడ్డి సంఘం బాధ్యులకు మధుసూదన్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

కేంద్రంపై తిరుగుబాటుకు సిద్ధం కావాలి



మాట్లాడుతున్న చాడ వెంకటరెడ్డి

కరీంనగర్: కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు మోడీ ప్రభుత్వం తీరని అన్యాయం చేసిందని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి మండిపడ్డారు. నగరంలోని గణేశ్‌నగర్ బైపాస్ రోడ్డులోని ఎల్ఐసీ ఏజెంట్ల సంఘం భవనంలో రెండురోజుల పాటు జరిగే సీపీఐ ఉమ్మడి కరీంనగర్ జిల్లా రాజకీయ శిక్షణ శిబిరాలను గురువారం ఆయన ప్రారంభించారు. పార్టీ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి అధ్యక్షత వహించగా సీపీఐ పతాకాన్ని సిద్దిపేట జిల్లా కార్యదర్శి మంద పవన్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ.. దేశంలో బీజేపీపై ప్రజల్లో వ్యతిరేకత పెరిగిపోతోందని అన్నారు. ప్రతిపక్ష పాలిత రాష్ట్రాలను మోడీ విస్మరించి బడ్జెట్‌లో నిధులు ఇవ్వకపోవడం దుర్మార్గమన్నారు. ఈ విషయమై రాష్ట్రానికి చెందిన కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌ని ప్రజలు నిలదీయాలని పిలుపునిచ్చారు. సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. సీపీఐకి ఘనచరిత్ర ఉందని, పార్టీ వంద సంవత్సరాలు పూర్తి చేసుకుందని, ఎన్నో పోరాటాలు, విజయాలు సాధించి పేదల పక్షాన నిలుస్తోందని అన్నారు. పార్టీ ప్రజా సంఘాలను గ్రామస్థాయి నుంచి బలోపేతం చేసుకోవడం కోసం ఈ రాజకీయ శిక్షణ శిబిరాలు ఉపయోగపడతాయని సూచించారు. కరీంనగర్, సిద్దిపేట, రాజన్న సిరిసిల్ల, పెద్దపల్లి ,జగిత్యాల జిల్లాల సీపీఐ కార్యదర్శులు మర్రి వెంకటస్వామి, మంద పవన్, గుంటి వేణు, తాండ్ర సదానందం, వెన్న సురేశ్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు పొనగంటి కేదారి, గడిపె మల్లేశ్, గోషిక మోహన్ పాల్గొన్నారు.

సత్తా చాటండి..

ప్రపంచ క్రీడావేడుకకు సమయం ఆసన్నమైంది. పతకాల పండక్కి తరుణమొచ్చింది. నేటి నుంచి పారిస్‌లో జరగనున్న ఒలింపిక్స్–2024లో పతకాలు సాధించాలనే లక్ష్యంతో 140కోట్ల భారతీయుల ఆశయాలతో 117మంది అథ్లెట్ల బృందం సిద్ధమైంది. పారిస్ ఒలింపిక్స్ సందర్భంగా ఉమ్మడి జిల్లాకు చెందిన ప్రముఖుల అభిప్రాయాలు..

– కరీంనగర్‌స్పోర్ట్స్



- IIలో

ఉద్యమంలా వన మహోత్సవం

- వారం రోజుల్లో లక్ష్యాన్ని పూర్తి చేయండి
- కలెక్టర్ పమేలా సత్పతి



మాట్లాడుతున్న కలెక్టర్ పమేలా సత్పతి, పక్కన అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, ఇతర అధికారులు

కరీంనగర్ అర్బన్: తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వనమహోత్సవాన్ని ఉద్యమంలా చేపట్టాలని కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశించారు. గురువారం కరీంనగర్ జెడ్పీ క్వార్టర్ల సముదాయంలోని సమావేశ మందిరంలో వన మహోత్సవ కార్యక్రమంపై జిల్లాలోని అన్నిశాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఆయా శాఖలకు సంబంధించిన లక్ష్యం.. నాటిన మొక్కల సంఖ్య... ఎప్పటి వరకు పూర్తి చేస్తారు తదితర అంశాలపై ఆరా తీశారు. కలెక్టర్ మాట్లాడుతూ.. డీఆర్డీవో, అటవీ, ఎక్సైజ్, ఆర్అండ్‌బీ, పలుశాఖల అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు వన మహోత్సవంలో విధించిన లక్ష్యాన్ని వారం రోజుల్లో పూర్తి చేయాలని సూచించారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. హైదరాబాద్ నుంచి ప్రతీరోజు ఉన్నతాధికారులు దీనిపై సమీక్ష నిర్వహిస్తున్నారని, ఈ మేరకు ప్లాన్ చేసుకొని ముందుకెళ్లాలని పేర్కొన్నారు. రహదారుల వెంట రైతు వేదికల్లో, అంగన్వాడీ సెంటర్లు, గ్రామాల్లో మొక్కలు విస్తృతంగా నాటాలని సూచించారు.

పారిశుధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివి

గ్రామాలు, పట్టణాలు అందంగా తీర్చిదిద్దడంలో పారిశుధ్య కార్మికుల సేవలు అద్భుతమని కలెక్టర్ పమేలా సత్పతి పేర్కొన్నారు. గురువారం జెడ్పీక్వార్టర్ల సముదాయంలో జరిగిన పారిశుధ్య కార్మికుల క్షేమం- గౌరవం అనే కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడారు. పారిశుధ్య కార్మికుల ఆరోగ్య పరిరక్షణకు ఆరోగ్య బీమా కల్పించే అంశాన్ని పరిశీలిస్తున్నామని, స్థానిక సంస్థల నిధుల నుంచి ఆరోగ్య బీమా చేస్తామని తెలిపారు. కార్మికులు రక్షణ కవచాలను ధరించి పని చేయాలని సూచించారు. ఈ సమావేశాల్లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, అసిస్టెంట్ కలెక్టర్ అజయ్ యాదవ్, డీఎఫ్‌వో బాలామణి, యూనిసెఫ్ స్టేట్ ప్రతినిధి ఫణిందర్ కుమార్, డీపీవో రవీందర్, డీఆర్డీవో శ్రీధర్, యూనిసెఫ్ జిల్లా కోఆర్డినేటర్ కిషన్ స్వామి, ఎస్ఎస్ఎస్ వేణు, జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాస్, ఉద్యాన వనాధికారి శ్రీనివాస్ పాల్గొన్నారు.

విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

కరీంనగర్‌రూరల్: హాస్టల్ విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. గురువారం రాత్రి కరీంనగర్ మండలం దుర్శేడ్‌లోని ఎస్సీ హాస్టల్‌ను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. రీడింగ్‌రూమ్, వంటగది, విద్యార్థులు నిద్రించే గదులను పరిశీలించారు. నాణ్యమైన భోజనం పెట్టాలని, ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. దోమల నియంత్రణకు చర్యలు చేపట్టాలని, ఏ సమస్య ఉన్న వెంటనే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. సోషల్‌వెల్ఫేర్ డీడీ హమీద్ పాల్గొన్నారు.

ఎన్‌హెచ్‌ఎం ఔట్‌సోర్సింగ్ తుది జాబితా విడుదల

కరీంనగర్‌టౌన్: నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్ఎం) కింద జిల్లా వైద్యారోగ్యశాఖలో ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో 8 రకాల ఉద్యోగాల భర్తీ కోసం ప్రభుత్వం ఈ యేడాది ఫిబ్రవరి 27న నోటిఫికేషన్ విడుదల చేసింది. గురువారం అర్హత కలిగిన అభ్యర్థుల తుది ఉత్తీర్ణత జాబితాను డీఎంహెచ్‌వో కార్యాలయంలో నోటీసు బోర్డులో, సంబంధిత శాఖ వెబ్‌సైట్లో అందుబాటులో ఉంచినట్లు డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నోటిఫికేషన్‌లో వైద్యాధికారి (4), స్టాఫ్‌నర్సు (21), ఎంఎల్‌హెచ్‌పీ (13), జిల్లా ప్రోగ్రాం కోఆర్డినేటర్ (1), ఏఎన్ఎం (1), ఫార్మసిస్టు (3), డీఈవో (1), ఆప్టోమెట్రిక్ (1) పోస్టులకు దరఖాస్తులు స్వీకరించిన విషయం విదితమే.

క్లుప్తంగా

మాలకుంట కట్ట ధ్వంసం

- పలువురిపై కేసు

కరీంనగర్: గన్నేరువరం మండలకేంద్రంలోని మాలకుంట కట్ట భాగాన్ని కబ్జా చేసిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గ్రామ మాజీ సర్పంచ్ భర్త పుల్లెల లక్ష్మణ్, మంగారపు లచ్చయ్య, గరిగె రాయమల్లు, దొగ్గలి లక్ష్మయ్యతో పాటు మరికొందరు ధ్వంసం చేశారని నీటి పారుదలశాఖ ఏఈ రాజకుమార్ ఈనెల 18వ తేదీన గన్నేరువరం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఎస్‌ఐ తాండ్ర నరేశ్ కేసు నమోదు చేశారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో మిషన్ కాకతీయ పథకంలో కట్ట అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందని, కానీ కట్ట భాగాన్ని ధ్వంసం చేస్తున్నారని ఏఈ ఫిర్యాదులో పేర్కొన్నాడు. దీంతోపాటు మాలకుంట కట్టకు సంబంధించిన హద్దుల వివరాలను తెలియజేయాలని గన్నేరువరం తహసీల్దార్ భిక్షపతికి ఈనెల 23వ తేదీన లెటర్ ద్వారా కోరినట్లు తెలుస్తోంది.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం


శివకుమార్ (ఫైల్)

రామగుండం: ఇంధన నిల్వల డిపో ఎదుట బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో శివకుమార్ (18) అనే యువకుడు మృతి చెందాడు. అంతర్గాం ఎస్సై బోయ వెంకట్ తెలిపిన వివరాల ప్రకారం.. తక్కళ్లపల్లికి చెందిన దాడి మల్లేశ్ కుమారుడు శివకుమార్ బుధవారం రాత్రి ఇద్దరు మిత్రులు కొండ వికాస్, పొన్నం సాయికిరణ్‌లతో కలిసి స్పోర్ట్స్' బైక్‌పై వ్యక్తిగత పనుల నిమిత్తం గోదావరిఖనికి వస్తున్నారు. హెచ్‌పీ పెట్రోల్ బంక్ ఎదుట ఓ వ్యాన్ గోదావరిఖనికి వెళ్లేందుకు యూటర్న్ తీసుకుంటున్న క్రమంలో ద్విచక్రవాహనం వేగంగా వచ్చి వ్యాన్‌ను ఢీకొంది. శివకుమార్ అక్కడికక్కడే మృతి చెందగా, వికాస్, సాయికిరణ్‌లకు గాయాలయ్యాయి. మృతుడి తండ్రి మల్లేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్సై తెలిపారు.

కరీంనగర్ వ్యాపారి..

కరీంనగర్‌రూరల్: అర్ధరాత్రివేళ రోడ్డుపై ఎలాంటి పార్కింగ్‌లైట్లు వేయకుండా నిలిపిన లారీని వెనుకనుంచి మారుతీవ్యాన్ వేగంగా వచ్చి ఢీకొట్టిన సంఘటనలో ఓ వ్యాపారి అక్కడికక్కడే మృతిచెందాడు. కరీంనగర్‌రూరల్ పోలీసుల కథనం ప్రకారం కరీంనగర్‌కు చెందిన తాటికొండ రమేశ్(49) చొప్పదండిలో బుక్‌స్టాల్, జనరల్ స్టోర్ నడిపిస్తున్నాడు. బుధవారం రాత్రి 11గంటలకు దుకాణం మూసివేసి కరీంనగర్‌కు మారుతీవ్యాన్‌లో బయల్దేరాడు. నగునూరు వద్ద ఎదురుగా వస్తున్న వాహనాల లైట్ల వెలుగుకు దారి కన్పించకపోవడంతో రోడ్డుపై నిలిపి ఉన్న లారీని వెనుకనుంచి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో రమేశ్ తల పగిలిపోయి అక్కడికక్కడే మృతిచెందాడు. చొప్పదండికి చెందిన తాళ్లపల్లి కనుకయ్య గమనించి మృతుడి మామ గౌరిశెట్టి రాజేందర్‌కు సమాచారం ఇవ్వడంతో కుటుంబసభ్యులతో కలిసి సంఘటనాస్థలానికి వెళ్లారు. మృతుడికి భార్య మాధురి ఉన్నారు. రోడ్డుపై ఎలాంటి ఇండికేటర్లు, పార్కింగ్‌లైట్లు వేయకుండా లారీని నిలిపి ఉంచి ప్రమాదానికి కారణమైన డ్రైవర్‌పై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని మృతుడి మామ రాజేందర్ గురువారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

గంజాయి బాధితులకు కౌన్సెలింగ్

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేటకు చెందిన కొందరు గంజాయిని సేవించే యువకులను గురువారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి రక్త నమూనాలను సేకరించి పరీక్షించారు. గంజాయి సేవిస్తున్నట్లు గుర్తించి గంజాయిని అమ్మడం ఎంత నేరమో తాగడం కూడా అంతే నేరమని ఎస్సై రమాకాంత్ చెప్పారు. గంజాయి ఎక్కడి నుంచి వస్తుంది, ఎవరు అమ్ముతున్నారు అనే దానిపై ఆరా తీశారు. చివరకు వ్యక్తిగత పూచీకత్తుపై యువకులను వదిలివేశారు.

సత్తా చాటండి.. పతకాలతో రండి

- నేటి నుంచి పారిస్ ఒలింపిక్స్
- టీం ఇండియాకు ఆల్ ది బెస్ట్
- ప్రతిభ చాటాలంటున్న ఉమ్మడి జిల్లా ప్రముఖులు



కరీంనగర్‌స్పోర్ట్స్: ప్రపంచ క్రీడావేడుకకు సమయం ఆసన్నమైంది. పతకాల పండక్కి తరుణమొచ్చింది. 2021లో టోక్యో ఒలింపిక్స్‌లో భారత క్రీడాకారులు ఒక బంగారు పతకంతో పాటు మొత్తం ఏడు పతకాలు సాధించి, త్రివర్ణ పతాక సత్తా చాటారు. నేటినుంచి పారిస్‌లో జరగనున్న ఒలింపిక్స్‌లో అంతకుమించి పతకాలు సాధించాలనే లక్ష్యంతో 140కోట్ల భారతీయుల ఆశయాలతో 117మంది అథ్లెట్ల బృందం సిద్ధమైంది. నేటినుంచి పారిస్ ఒలింపిక్స్ సందర్భంగా క్రీడాకారులందరూ వారివారి విభాగాల్లో సత్తా చాటి.. పతకాలు సాధించాలని ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన ప్రముఖులు ఆకాంక్షిస్తున్నారు.

దేశ పతాకం ఎగురవేయాలి



టోక్యో ఒలింపిక్స్‌లో భారత క్రీడాకారులు ఏడు పతకాలతో మెరిశారు. పారిస్ ఒలింపిక్స్‌లో రెట్టింపు ఉత్సాహంతో భారత క్రీడాకారులు దేశ పతాకాన్ని సగౌరవంగా ఎగురవేసే విధంగా పతకాలు సాధించాలి. తెలుగింటి క్రీడాకారులు సత్తా చాటాలి.

– పమేలా సత్పతి, కలెక్టర్, కరీంనగర్

జూడోలో తొలిపతకం అందించాలి



పారిస్ ఒలింపిక్స్‌లో జూడోలో తులికమాన్ 78 కేజీల పైవిభాగంలో సత్తా చాటేందుకు సిద్ధమయ్యాడు. సాధన చేసిన మన దేశానికి ఒలింపిక్స్‌లో జూడోక్రీడా విభాగంలో తొలి పతకం అందించాలి. దేశ క్రీడాకారులు పతకాల పట్టికలో దూసుకెళ్లాలి. – గసిరెడ్డి జనార్దన్‌రెడ్డి, జూడో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

పతకాలతో రావాలి



తెలంగాణ అమ్మాయిలు సింధూ, నిఖత్, ఇషా, శ్రీజలు పతకాలతో తిరిగిరావాలి. గతంలో సింధూ ఒక్కరే పతకం సాధించగా ఈ సారి ముగ్గురు క్రీడాకారిణులు పతకాల రేసులో ఉన్నారు. జట్టులో తెలంగాణ నుంచి నలుగురు ప్రాతినిధ్యం వహించడం విశేషం.

– బి.శ్రీకాంత్ రెడ్డి, డీవైఎస్‌వో, కరీంనగర్

గొప్ప ప్రదర్శన ఇవ్వాలి



పారిస్ ఒలింపిక్స్‌లో ఇండియన్ క్రీడాకారులు గొప్ప ప్రదర్శన ఇవ్వాలి. భవిష్యత్ క్రీడాకారులకు స్ఫూర్తిని ఇవ్వాలి. ప్రస్తుతకాలంలో స్పోర్ట్స్ అండ్ గేమ్స్ చాలా ముఖ్యం. ఒలింపియన్ల స్ఫూర్తితో భవిష్యత్ క్రీడాకారులు ఎదగాలి.

– లక్ష్మికిరణ్, అదనపు కలెక్టర్, కరీంనగర్

పతకాల పంట పండించాలి



గతంలో కన్నా ఎక్కువ పతకాలు సాధించి దేశ ప్రతిష్టను పెంచాలి. ఎక్కువ విభాగాల్లో రాణించాలి. మన దేశం నుంచి ఒలింపిక్స్‌లో పాల్గొనే ప్రతీ క్రీడాకారునికి దేశంలోని ప్రతీ పౌరుడు మద్దతు పలుకుతున్నారు. పోటీల్లో పాల్గొనే అథ్లెట్లకు ఆల్ ది బెస్ట్.

– జీవీ.శ్యాంప్రసాద్ లాల్, అదనపు కలెక్టర్, పెద్దపల్లి

దేశకీర్తిని చాటాలి



ఒలింపిక్స్‌లో భారత క్రీడాకారులు దేశకీర్తిని చాటాలి. దేశంనుంచి పోటీల్లో పాల్గొంటున్న క్రీడాకారులకు అభినందనలు. అత్యధికంగా గోల్డ్‌మెడల్స్ సాధించి, మిగతా దేశాలకన్నా ముందు వరుసలో మన జాతీజెండాను నిలపాలి.

– మిట్టు శ్రీనివాస్, రామగుండం పోలీస్ కమిషనర్

ఆల్ ది బెస్ట్



ఒలింపిక్స్‌లో పాల్గొనే భారత ఆటగాళ్లకు ఆల్ ది బెస్ట్. గత ఒలింపిక్స్‌లో సాధించిన పతకాల కన్నా ఎక్కువ సాధించి దేశంలో క్రీడారంగాభివృద్ధికి బాటలు వేయాలి. క్రీడల్లో భారత్‌ను ప్రపంచంలో నంబర్‌వన్‌గా నిలపాలి. ఒలింపిక్స్ ఆడబోతున్న క్రీడాకారులకు ఆల్ దిబెస్ట్.

– ప్రఫుల్ దేశాయ్, అదనపు కలెక్టర్, కరీంనగర్

సత్తా చాటాలి



పారిస్‌లో నేటి నుంచి ప్రారంభంకానున్న ఒలింపిక్స్‌లో భారత క్రీడాకారులు సత్తా చాటాలి. గత ఒలింపిక్స్ జావెలీన్ త్రోస్‌లో బంగారు పతకం సాధించిన నీరజ్ చోప్రా ఈ సారి బంగారు పతకంతో తిరిగి రావాలి. పతకాల పట్టికలో భారత్ మెరుగైన ర్యాంక్ సాధించాలి.

– జి.నరేందర్, కరీంనగర్ టౌన్ ఏసీపీ

డయల్ 100కు తక్షణ స్పందన

- వృద్ధుడిని కాపాడిన పోలీసులు


స్పృహ కోల్పోయిన రాజయ్యను ఆస్పత్రికి తరలిస్తున్న పోలీసులు

సిరిసిల్లక్రైం: తమ కుటుంబంలో 81 ఏళ్ల వృద్ధుడు మూడురోజులుగా కనబడడం లేదని డయల్ 100కు సమాచారం ఇవ్వడంతో పోలీసులు స్పందించారు. హుటాహుటినా దర్యాప్తు ప్రారంభించి గురువారం వృద్ధుడిని కుటుంబీకులకు అప్పగించారు. వివరాలు.. సిరిసిల్ల పట్టణం శాంతినగర్‌కు చెందిన వృద్ధుడు గుంటుక రాజయ్య తన ఇంటి సమీపంలో కొందరితో మాట్లాడేందుకు మంగళవారం వెళ్లి తిరిగి రాలేదు. మూడు రోజులుగా కుటుంబీకులు తెలిసిన వారితోపాటు పరిసర ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించకపోవడంతో డయల్ 100 సమాచారం అందించారు. వెంటనే స్పందించిన సిరిసిల్ల టౌన్ పోలీసులు ఎస్‌ఐ శ్రీనివాస్, బన్సీలాల్, ఉమాపతి, ఎల్లగౌడ్, రాజేందర్, శ్రీధర్ వృద్ధుడి కోసం పట్టణంలో వెతికారు. వంశీకృష్ణ కాలనీలో వర్షపు నీటిలో స్పృహ తప్పిపోయి పడి ఉన్న రాజయ్యను బయటకు తీసి వెంటనే చికిత్స కోసం 108లో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కుటుంబీకులకు అప్పగించారు.

ప్రముఖులొస్తున్నారని..


ఎల్‌ఎండీ కరకట్టపై తొలగించిన చెట్లు

తిమ్మాపూర్: మానేరు కరకట్టపై ఎన్నోరోజులుగా అడ్డంగా ఉన్న చెట్లను ఎస్సారెస్పీ అధికారులు బుధవారం సాయంత్రం నుంచి గురువారం వరకు హడావుడిగా తొలగించారు. ఎల్‌ఎండీ పరిశీలనకు గురువారం సాయంత్రం బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు వస్తున్నారన్న సమాచారంతో అధికారులు కరకట్టపై వాహనాలకు అడ్డుగా ఉన్న చెట్లను తొలగించారు. ఇటీవల 'సాక్షి'లో 'ఇటు చూడరు.. పట్టించుకోరు' అనే కథనం వచ్చినప్పటికీ పట్టించుకోని అధికారులు, ప్రతిపక్ష ఎమ్మెల్యేలు వస్తుండడంతో హడావుడిగా తొలగించారని పలువురు అంటున్నారు.

ఉరేసుకుని వివాహిత బలవన్మరణం


మమత మృతదేహం

చొప్పదండి: పట్టణంలోని సంతోష్‌నగర్‌కు చెందిన రాచకొండ మమత గురువారం ఆత్మహత్య చేసుకుంది. ఎస్‌ఐ గొల్లపల్లి అనూష తెలిపిన వివరాలు... ముదిగంటి కొమురయ్య కూతురు మమతను చింతకుంటకు చెందిన రాచకొండ లక్ష్మణ్‌కు ఇచ్చి 2019లో పెళ్లి చేశాడు. వివాహ సమయంలో ఏడు తులాల బంగారం, ఇతర కట్నకానుకలు సమర్పించాడు. ఏడాదిగా భార్యభర్తల మధ్య గొడవలు మొదలయ్యాయి. పెళ్లై ఏళ్లు గడుస్తున్నా సంతానం కలగడం లేదని భర్త శారీరక, మానసికంగా హింసించాడు. మమత తల్లిదండ్రులు ఇద్దరిని ఆసుపత్రుల్లో చూపెట్టారు. మందులు వాడాలని డాక్టర్లు సూచించినా లక్ష్మణ్ వాడకుండా ఏ పని చేయకుండా తిరిగేవాడు. బాధలు భరించలేక మమత పదిహేను రోజుల క్రితం పుట్టింటికి వచ్చింది. గురువారం సాయంత్రం ఇంట్లో ఎవరు లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకొంది. తల్లి పద్మ ఇంటికి వచ్చి చూడగా అప్పటికే మృతి చెందింది. భర్త వేధింపుల కారణంగానే మమత మృతి చెందిందని కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ వివరించారు.

మహిళా సంఘం భవనం సీజ్


భవనాన్ని సీజ్ చేస్తున్న అధికారులు

వీణవంక: మండలంలోని చల్లూరు గ్రామంలో మహిళా సమాఖ్య భవనాన్ని కలెక్టర్ ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు సీజ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలను ఆనుకొని 2009లో భవనాన్ని నిర్మించారు. భవనం పాఠశాల ఆధీనంలో ఉందని అక్రమంగా నిర్మించారని ఇప్పలపల్లి గ్రామానికి చెందిన రిటైర్డ్ టీచర్ రఘునాథరెడ్డి హైకోర్టుకు వెళ్లారు. హైకోర్టు ఆదేశాల మేరకు ఆర్ఐ రవి సిబ్బందితో వెళ్లి భవనాన్ని సీజ్ చేసి స్వాధీనం చేసుకున్నారు. భవన నిర్మాణ విషయంలో అప్పటి కలెక్టర్ సందీప్‌కుమార్ సుల్తానియాతో పాటు పలువురు అధికారులు, గ్రామ సర్పంచ్‌కు జైలు శిక్ష విధించగా సుప్రీంకోర్టుకు వెళ్లి స్టే తెచ్చుకున్నారు. అయితే భవనం సీజ్ చేయడంతో మహిళా సంఘం కార్యకలాపాలు ఎక్కడ నిర్వహించుకోవాలి అని మహిళలు ఆందోళన చెందుతున్నారు.

గేదెను ఢీకొన్న ఆటో : ఒకరి మృతి


శేఖర్ (ఫైల్)

జ్యోతినగర్: ఎన్టీపీసీ పోలీస్ స్టేషన్ పరిధి రాజీవ్ రహదారి సుభాష్‌నగర్ వద్ద బుధవారం అర్ధరాత్రి సమయంలో రోడ్డుపై ఉన్న గేదెను ఆటో ఢీకొనడంతో రామగుండం ఎన్టీపీసీ కాలనీకి చెందిన బదావత్ శేఖర్(36) ప్రాణాలు కోల్పోయాడు. కుటుంబసభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రామగుండం నుంచి బుధవారం రాత్రి ఎన్టీపీసీ వైపు ఆటోలో ఓలపు రాజేశ్, ప్రశాంత్, శోభన్ వస్తుండగా రోడ్డుపై ఉన్న గేదె కనిపించకపోవడంతో దానిని ఢీకొట్టారు. ఆటోలో ఉన్న నలుగురు కిందపడి పోగా బదావత్ శేఖర్(36)కు బలమైన గాయాలయ్యాయి. బ్లూకోల్ట్స్ పోలీసులు క్షతగాత్రులను చికిత్స నిమిత్తం గోదావరిఖని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి శేఖర్ మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి భార్య సుమలత ఫిర్యాదు మేరకు ఎన్టీపీసీ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఓలపు రాజేశ్, ప్రశాంత్, శోభన్‌లకు స్వల్ప గాయాలయ్యాయి.

తాళం వేసిన ఇంట్లో చోరీ

- రూ.4లక్షలు, 15తులాల బంగారం చోరీ
- వేలిముద్రలు సేకరించిన పోలీసులు


దొంగతనం జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న ఎస్సై తిరుపతి

జగిత్యాలక్రైం: జగిత్యాల జిల్లాకేంద్రంలోని గోవిందుపల్లికి చెందిన ఎదురుగట్ల సతీశ్ ఇంట్లో గుర్తుతెలియని దొంగలు చొరబడి రూ.4లక్షలు, 15 తులాల బంగారాన్ని ఎత్తుకెళ్లినట్లు బాధితులు తెలిపారు. సతీశ్ బుధవారం రాత్రి ఇంటికి తాళం వేసి ఫస్ట్ ఫ్లోర్‌లో నిద్రించాడు. గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తాళాలు పగులగొట్టి బీరువాలోని రూ.4 లక్షలు, 15 తులాల బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లారు. ఉదయం చూసిన సతీశ్ లబోదిబోమన్నాడు. అలాగే అదే కాలనీలో మరో ఇంట్లో కూడా దొంగలు చోరీకి ప్రయత్నించారు. ఇంటి ఆవరణలో ఉన్న సీసీ కెమెరాలు పగులగొట్టి డీవీఆర్‌ను ఎత్తుకెళ్లారు. బాధితులు పట్టణ పోలీసులకు సమాచారం అందించగా.. ఎస్సై తిరుపతి సంఘటన స్థలానికి చేరుకుని క్లూస్‌టీం ద్వారా వేలిముద్రలు సేకరించారు.

‘మధ్యమానేరు’ నిండేనా?

- ఆశాజనకంగా లేని వర్షాలు
- ప్రాజెక్టులోకి చేరని వరద
- గతేడాది జూలైలో 15 టీఎంసీలు
- ఇప్పుడు కేవలం 5 టీఎంసీలు మాత్రమే


నీరులేక వెలవెలబోతున్న మధ్యమానేరు ప్రాజెక్టు


పిచ్చి మొక్కలతో మిడ్‌మానేరు ఎడమ కాల్వ

బోయినపల్లి: మధ్యమానేరు ప్రాజెక్టు వానాకాలంలోనూ నీరు లేక వెలవెలబోతోంది. వర్షాకాలం ప్రారంభమై రెండునెలలు గడుస్తున్నా మండలంలోని మాన్వాడ శ్రీ రాజరాజేశ్వర (మిడ్ మానేరు) ప్రాజెక్టులో నీటినిల్వలు పెరగడం లేదు. గతేడాది జూలైలో ప్రాజెక్టులో 15 టీఎంసీల మేర నీటి నిల్వ ఉండగా నేడు 5 టీఎంసీల మేర డెడ్‌స్టోరేజీలోనే ఉంది. గంభీరావుపేట మండలం నర్మాల అప్పర్ మానేరు, కరీంనగర్ ఎల్‌ఎండీ ప్రాజెక్టుల్లోకి సైతం వరద నీరు చేరలేదు. గతంలో సీజన్ ఆరంభంలోనే వానలు దంచికొట్టడంతో ప్రాజెక్టుల్లోకి జూన్, జూలై నెలల్లో భారీగా వరదనీరు చేరింది. మిడ్‌మానేరులో ఇప్పటివరకు కేవలం 0.515 టీఎంసీల మేర మాత్రమే వరదనీరు చేరడం గమనార్హం. మిడ్‌మానేరు ప్రాజెక్టుతో పాటు ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వలు నీరులేక పిచ్చి చెట్లతో కనిపిస్తుండగా మధ్యమానేరు నిండేదెలా అని పలువురు చర్చించుకుంటున్నారు.

మూడేళ్లుగా వరదపోటు

గడిచిన 2021, 2022, 2023 జూన్, జూలై నెలల్లో మధ్యమానేరు ప్రాజెక్టులోకి భారీగా వరదనీరు చేరింది. 2021 జూన్, జూలైలో సుమారు 9టీఎంసీల మేర నీరుచేరగా 2022 జూన్, జూలై నెలల్లో సు మారు 15 టీఎంసీలు 2022 జూలైలో సుమారు 14 టీఎంసీల మేర రికార్డుస్థాయి నీరుచేరింది. గతేడాది జూలైలో ప్రాజెక్టులో 15 టీఎంసీల మేర నీరు నిల్వ ఉంది.

మిడ్, అప్పర్, లోయర్ మానేరు ప్రాజెక్టుల నీటి నిల్వ వివరాలు

మిడ్‌మానేరు ప్రాజెక్టు	
పూర్తి నీటి సామర్థ్యం	: 27. 50 టీఎంసీలు
ప్రస్తుతం నిల్వ ఉన్న నీరు	: 5.82 టీఎంసీలు
ఎల్‌ఎండీ పూర్తి నీటిమట్టం	: 24.034, టీఎంసీలు
ప్రస్తుత నీటిమట్టం	: 5.134 టీఎంసీలు
ఎగువమానేరు ప్రాజెక్టు పూర్తి నీటిమట్టం	: 2 టీఎంసీలు
ప్రస్తుత నీటిమట్టం	: 0.40 టీఎంసీలు

మధ్యమానేరు నుంచి ఎల్‌ఎండీకి, కుడికాల్వకు, అన్నపూర్ణ రిజర్వాయర్‌కు భారీగా నీరు విడుదల చేశారు

మిడ్‌మానేరు నిండేదెలా..?

ఈ ఏడాది వర్షాలు ఆశాజనకంగా లేకపోవడంతో ప్రాజెక్టులోకి వరదనీరు చేరడం లేదు. మేడిగడ్డ మరమ్మతు పనులతో కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి నీరు విడుదల చేసే వీలు లేదు. ఎస్సారెస్పీ నుంచి నీరు విడుదల చేసే అవకాశం ఉన్నా, తగిన నీటి నిల్వలు లేవు. మహారాష్ట్రలో భారీ వర్షాలు కురిస్తే ఎస్సారెస్పీకి వరదనీరు చేరే అవకాశం ఉంది. కనీసం 40 టీఎంసీల మేర నీరుచేరితే వరదకాల్వ ద్వారా నీరు విడుదల చేసే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. ఎల్లంపల్లి ప్రాజెక్టు కెపాసిటీ 20.175 టీఎంసీలు కాగా, కడెం ప్రాజెక్టు నుంచి వరద చేరడంతో ఇపుడు 11 టీఎంసీల మేర నీరు చేరింది. మిడ్‌మానేరులో నీటి నిల్వలు పెరగాలంటే భారీ వర్షాలు లేదా ఎస్సారెస్పీ, ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేయాలి.

ముసుర్లకు చేరని వరద

ఈ యేడు ఇప్పటివరకు భారీ వర్షాలు కురవలేదు. సమృద్ధిగా వర్షాలు కురిస్తే వేములవాడ మూలవాగు, సిరిసిల్ల పెద్ద వాగు, చిన్న వాగు,ఆవునూర్ చెరువుల్లో నుంచి వరదనీరు మిడ్ మానేరు ప్రాజెక్టులోకి చేరుతుంది. నర్మాల అప్పర్ మానేరు పొంగితే సైతం మిడ్‌మానేరు ప్రాజెక్టులోకి వరద చేరుతుంది. రెండేళ్లుగా పై వాగులు, వంకలు పొంగిపొర్లడంతో ప్రాజెక్టులోకి భారీగా వరదనీరు చేరింది. మిడ్ మానేరులో ప్రస్తుతం చేరిన 0.515 టీఎంసీల వరద నీరు వేములవాడ మూలవాగు, నక్కవాగు వరద నీరే కావడం గమనార్హం.

మధ్యమానేరే ఆధారం

కరీంనగర్ ఎల్‌ఎండీ ప్రాజెక్టు ఆయకట్టుకు మూడేళ్లుగా వానాకాలం, యాసంగి పంటలకు మిడ్‌మానేరు ప్రాజెక్టు సాగునీరందేది. ప్రస్తుతం మిడ్‌మానేరు ప్రాజెక్టులో నీరు లేకపోవడంతో దీని ప్రభావం ఎల్‌ఎండీ ఆయకట్టుపై పడే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఎల్‌ఎండీ ప్రాజెక్టులో 5.135 టీఎంసీల మేర మాత్రమే నీరు ఉండగా మోయతుమ్మెద వాగు నుంచి స్వల్ప ఇన్‌ఫ్లో వస్తోంది. గత రెండేళ్లుగా మిడ్‌మానేరు ప్రాజెక్టు నుంచి ఎల్‌ఎండీలోకి సుమారు 50 టీఎంసీలకు పైగానే నీరు విడుదల చేసినట్లు అధికారులు చెబుతున్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని మూడు ప్రధాన ప్రాజెక్టుల్లోకి ఇన్‌ఫ్లో రాకపోవడం మూడేళ్లుగా ఇదే తొలిసారి కావడం విశేషం. మిడ్‌మానేరు పూర్తిగా నిండితే బ్యాక్ వాటర్ 17 కిలోమీటర్ల మేర ఉంటుంది. ప్రస్తుతం ప్రాజెక్టు బ్యాక్ వాటర్ కేవలం ఆరు కిలోమీటర్ల మేర మాత్రమే ఉంది.

మద్యానికి బానిసై వృద్ధుడి ఆత్మహత్య


రాజు (ఫైల్)

సిరిసిల్లక్రైం: మద్యానికి బానిస కావడంతోపాటు అనారోగ్యం కారణంగా జీవితంపై విరక్తిచెందిన వృద్ధుడు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన గురువారం సిరిసిల్లలో జరిగింది. పోలీసుల వివరాలు.. సిరిసిల్ల పట్టణం ఆదర్శనగర్‌లో నివాసం ఉండే మాలోతు రాజు (60) ఆర్టీసీలో డ్రైవర్‌గా పని చేసి ఆరోగ్యం సరిగా లేక కొన్నేళ్ల క్రితం వాలంటరీ రిటైర్‌మెంట్ తీసుకున్నాడు. అతడికి ఇద్దరు కూతుళ్లు, ఇద్దరు కుమారులుండగా అందరికీ వివాహమైంది. రాజు భార్యతోపాటు చిన్న కొడుకు ఇంట్లో ఉంటున్నాడు. మద్యానికి బానిస కావడంతో పాటు ఫిట్స్ రావడంతో కొద్ది రోజులుగా తాను ఉరేసుకుని, విషంతాగి చనిపోతానని అనేవాడు. దీంతో కుటుంబీకులు అతడికి నచ్చచెప్పేవారు. ఈక్రమంలో గురువారం ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లి రాకపోవడంతో కుటుంబీకులు స్థానికంగా వెతికారు. బతుకమ్మ ఘాట్‌వద్ద చెట్టుకు ఉరేసుకుని మృతిచెంది ఉన్నాడు. మృతదేహం పక్కన మద్యం బాటిల్, నీళ్లు, చేతికర్ర ఉంది. మృతుడి కూతురు భూక్య నిర్మాలాదేవి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

స్నాప్‌చాట్ ఫేక్ ఐడీ నిందితుడి గుర్తింపు

రుద్రంగి(వేములవాడ): రుద్రంగి మండల కేంద్రానికి చెందిన ద్యావల దినేశ్ పేరుపై స్నాప్ చాట్ ఫేక్ ఐడీ క్రియేట్ చేసి ఓ మహిళకు అసభ్యకర మెస్సేజ్‌లు పంపించగా, బాధితుడు సైబర్ పోర్టల్ 1930 నందు ఫిర్యాదు చేశాడు. ఈక్రమంలో ఎస్సై అశోక్ ఐటీ యాక్ట్ కింది కేసు నమోదు చేయగా విచారణ చేపట్టారు. చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు సాంకేతిక పరిజ్ఞానంతో స్నాప్ చాట్ ఫేక్ అకౌంట్ తెరిచిన ద్యావల అజయ్‌ని గుర్తించి అరెస్టు చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ, సైబర్ నేరాల పట్ల ప్రజలు, మహిళలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోతే డయల్ 1930 లేదా నేషనల్ సైబర్ పోర్టల్ నందు ఫిర్యాదులు నమోదు చేయాలని కోరారు.

తప్పుడు పత్రాలతో భూ ఆక్రమణ.. ముగ్గురి అరెస్టు

కరీంనగర్‌క్రైం: తప్పుడుపత్రాలు సృష్టించి భూమిని ఆక్రమించిన కేసులో ముగ్గురిని అరెస్టు చేసి కోర్టు ఆదేశాల మేరకు గురువారం రిమాండ్ చేసినట్లు రూరల్ సీఐ ప్రదీప్‌కుమార్ తెలిపారు. కరీంనగర్‌లోని హౌసింగ్‌బోర్డుకాలనీకి చెందిన చెడె రాధికకు తనతల్లి భూపతి రాజమణి వల్లంపహాడ్ గ్రామంలోని 200గజాల భూమిని 2013లో గిఫ్ట్‌డీడ్‌గా ఇచ్చింది. అందులో నిర్మాణం చేద్దామని వెళ్లగా.. చుట్టూ గోడకట్టి ఉంది. మూల ప్రభాకరెడ్డి, పెరుకరి శ్రీనివాస్, జోముకుంట మల్లయ్య తన భూమి ఆక్రమించారని కరీంనగర్ రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టిన పోలీసులు సదరు భూమిని రాధిక తల్లి రాజమణి శ్రీప్రియ రియల్ ఎస్టేట్ కంపెనీ ద్వారా కొనుగోలు చేసిందని, ఈ కంపెనీ ఇక్కడ దాదాపు 15 ఎకరాల 22 గుంటల స్థలాన్ని వెంచర్‌గా మార్చిందని, 1993 నుంచి 1996 వరకు ఎస్‌హెచ్ భాస్కర్‌రెడ్డి ఓపెన్‌ప్లాట్లుగా మార్చి పలువురికి విక్రయించినట్లు గుర్తించారు. అయితే సరైన హద్దులు చూపించలేదు. రాధిక అనే బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో నిందితులు ముగ్గురిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచారు. అనంతరం జైలుకు తరలించారు.

గంజాయి పట్టివేత.. నిందితుడి అరెస్టు



నిందితుడి అరెస్ట్ చూపుతున్న సీఐ వెంకటేశ్వర్లు

కోనరావుపేట(వేములవాడ): మండలంలోని సుద్దాలలో గంజాయి తరలిస్తుండగా ఓ వ్యక్తి పోలీసులకు చిక్కాడు. చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు కథనం ప్రకారం.. కోనరావుపేట మండలం సుద్దాల గ్రామానికి చెందిన వడ్లూరి వెంకటేశ్ గంజాయికి అలవాటుపడ్డాడు. జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలం తిప్పాయిపల్లి, భీమ్‌గల్ ప్రాంతాల్లో వ్యక్తుల వద్ద గంజాయి కొనుగోలు చేసి తాగుతుండేవాడు. తాగగా మిగిలిన గంజాయికి అలవాటు పడిన వారికి విక్రయిస్తుండేవాడు. గురువారం వెంకటేశ్ గంజాయితో సుద్దాలకు వస్తున్నాడన్న సమాచారంతో పోలీసులు అతడిని అదుపులోకి తీసుకోగా 100 గ్రాముల గంజాయి లభ్యమైంది. కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ, గంజాయికి సంబంధించిన సమాచారం ఉంటే 100కు లేదా టాస్క్‌ఫోర్స్ సీఐ నంబర్ 87126 56392 సమాచారం అందించాలని కోరారు. ఆయన వెంట కోనరావుపేట ఎస్సై ఆంజనేయులు ఉన్నారు.

హోటళ్లకు భారీ జరిమానా

జగిత్యాల: జగిత్యాల జిల్లాకేంద్రంలో ఇటీవల హోటళ్లు, కిరాణ షాపులతోపాటు, బేకరీల్లో ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు తనిఖీలు చేపట్టారు. ఫుడ్ ఇన్‌స్పెక్టర్ తనిఖీలు చేసినప్పుడు శాంపిళ్లు సేకరించి ల్యాబ్‌కు పంపించారు. ఇందులో హోటళ్లలో నాణ్యత పాటించడం లేదని తేలింది. ఈ మేరకు జాయింట్ కలెక్టర్ రాంబాబు పలు హోటళ్లకు జరిమానా విధించారు. జిల్లా కేంద్రంలోని హోటళ్లు, రెస్టారెంట్లు, సూపర్ మార్కెట్, కిరాణంషాపులకు సుమారు రూ.6.35లక్షల జరిమానా విధించారు. ఇక ముందు నాణ్యత గల సరుకులు అందించకపోతే కఠిన చర్యలుంటాయని ఫుడ్ ఇన్‌స్పెక్టర్ అనూష తెలిపారు.

పాలక్... పన్నీరు

మనసున్న పాట

పాలక్ ముచ్చల్ అనే పేరు వినిపించగానే తీయటి పాట ఒకటి గుర్తొస్తుంది సింగర్‌గా మంచి పేరు తెచ్చుకున్న పాలక్ సామాజిక సేవలోనూ తన వంతుగా కృషి చేస్తోంది. ఫండింగ్ ద్వారా ఇప్పటి వరకు మూడు వేల మంది పేద పిల్లలకు గుండె ఆపరేషన్‌లు చేయించింది.



బాలీవుడ్ సినిమా 'ఎంఎస్ దోని–ది అన్ టోల్డ్ స్టోరీ'లోని 'కౌన్ తుఝే' పాటతో ఎంతోమంది అభిమానులను సంపాదించుకుంది పాలక్. ఇండోర్‌కు చెందిన పాలక్‌కు కాలేజీ రోజుల నుంచి పాటతో పాటు సేవా బాటలో పయనించడం అంటే కూడా ఇష్టం.

పాలక్ తొలి ఫండ్ రైజింగ్ ప్రాజెక్ట్ కార్గిల్ వీర సైనికుల కోసం చేసింది. ప్రతి షాప్ ముందుకు వెళ్లి దేశభక్తి గీతాలు పాడి 'కార్గిల్ వీర సైనికులకు మీ వంతుగా సహాయం చేయండి' అని అడిగేది.

కళ, సామాజిక సేవను పాలక్ వేరు చేసి చూడదు. మూడు వేల మంది పేద పిల్లలకు గుండె ఆపరేషన్‌లు చేయించడానికి తనలోని కళ బలమైన మాధ్యమంగా ఉపయోగపడుతుందని చెబుతుంది పాలక్.

సినిమాల్లో అవకాశాలు దొరకని రోజుల్లో కూడా ఎన్నో ప్రోగ్రామ్స్ చేసి పేద పిల్లల కోసం విరాళాలు సేకరించేది.

పాలక్ ఒక మ్యూజిక్ ప్రోగ్రామ్ చేసిందంటే పది మంది పేద పిల్లల వైద్యానికి అవసరమైన డబ్బును సేకరించినట్లే. బాలీవుడ్‌లో సింగర్‌గా పాలక్‌కు మంచి పేరు రావడమే కాదు ఆ పేరు విరాళాల సేకరణకు బాగా ఉపయోగపడింది.

'మీ పాట అద్భుతం' అనే ప్రశంస కంటే, పేదింటి తల్లిదండ్రుల గొంతు నుంచి వినిపించే...

'మీ వల్ల మా బిడ్డ బతికింది' అనే మాట పాలక్‌కు ఎక్కువ సంతృప్తి ఇస్తుంది. ఇప్పుడు పాలక్ వెయిటింగ్ లిస్ట్‌లో 413 మంది పిల్లలు ఉన్నారు. వారికి హార్ట్ సర్జరీలు చేయించాల్సిన బాధ్యతను భుజాలకెత్తుకుంది.

'మనస్ఫూర్తిగా కోరుకుంటే అంతా మంచే జరుగుతుంది. పేదపిల్లలకు అండగా నిలవడానికి ఇది దేవుడు ఇచ్చిన అవకాశంగా భావిస్తాను' అంటుంది పాలక్ ముచ్చల్.

ఫ్యాషన్



గ్రామీణ మహిళా కళాకారులను ప్రోత్సహించడానికి, వారి వారసత్వ కళను, ఫ్యాబ్రిక్ క్రాఫ్ట్‌ను భారతదేశం అంతటా పరిచయం చేయడానికి ది వోవెన్ ల్యాబ్ పేరుతో కృషి చేస్తున్నారు భూపాల్ వాసి నిఖితా కౌశిక్. ముంబైలోని నిఫ్ట్ పూర్వవిద్యార్థి అయిన నిఖిత జీరోవేస్ట్ పాలసీతో పాతికమంది గ్రామీణ మహిళల చేత పట్టణ మహిళల కోసం ఆధునికంగా డ్రెస్‌లను డిజైన్ చేయించి, వారికి ఉపాధి కల్పిస్తున్నారు. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన 'స్టైల్ తత్త్వ' ఎగ్జిబిషన్‌లో క్రాఫ్ట్స్, హ్యాండ్లూమ్ క్లస్టర్స్‌కి వారధిగా ఉంటూ చేస్తున్న కృషిని వివరించారు.

సిటీకి పల్లె కళ

''ఈ రోజు మనం భారతీయులమని చెప్పుకోవడానికి గర్విస్తున్నామంటే మన దేశంలోని విభిన్న సంస్కృతులూ, సంప్రదాయాలూ కారణం. వేటికవి సొంత మార్గాలలో ప్రత్యేకమైనవి. ఫలితంగా మన జీవితంలో దుస్తులు ముఖ్యమైన అంశంగా మారాయి. మన గ్రామీణ మహిళా కళాకారుల హస్తకళ శిల్ప నైపుణ్యాన్ని చేతితో నేసిన వస్త్రాలను మరింత మెరుగుపరచడంలో మా పని కీలకంగా ఉంటుంది. చిట్ట చివరగా ఉపయోగించే చిన్న ఫ్యాబ్రిక్ పీస్‌తో కూడా 'కళ'ద్వారా అందంగా డిజైన్ చేస్తాం. ఇందుకోసం నిరంతరం పరిశోధన జరుగుతూనే ఉంటుంది. అందుకే, మా బ్రాండ్‌కు 'ది వోవెన్ ల్యాబ్' అని పేరు పెట్టాం.



నిఖితా కౌశిక్

జీరో వేస్ట్ పాలసీ

రాజస్థాన్, గుజరాత్ భోపాల్.. ప్రాంతాల్లోని గ్రామీణ, గిరిజన మహిళల చేతుల్లో రూపుదిద్దుకున్న మా దుస్తుల డిజైన్స్ బయట షాపుల్లో లభించవు. ఎగ్జిబిషన్లు, ఆన్‌లైన్ ద్వారా అమ్మకం చేస్తుంటాం. మన దేశీ కాలా పత్తితో పాటు టెన్సెల్, రీసైకిల్ ఫ్యాబ్రిక్స్, పర్యావరణ అనుకూలమైన క్లాత్‌తోనే డిజైన్ చేస్తున్నాం. అరుదైన కాటన్ ఫ్యాబ్రిక్, ప్రాచీన కళా వైభవం గల మోడర్న్ డిజైనరీ డ్రెస్సులు కాబట్టే వీటి ఖర్చు ఎక్కువే. కానీ, ఎక్కడ ఉన్నా ప్రత్యేకతను చాటుతుంటాయి.

మహిళా సాధికారత

మా సంస్థకు ఉన్న బలమైన స్తంభాలలో ఒకటి మహిళా సాధికారత. ఇప్పటికి పాతిక మంది గ్రామీణ మహిళలు ఈ డిజైన్స్ కోసం కృషి చేస్తున్నారు. కళ పట్ల ఆసక్తి ఉన్న గ్రామీణ బాలికలను ఎంపిక చేసుకొని, శిక్షణ ఇవ్వడమే కాకుండా, వారి ప్రాథమిక విద్య కూడా సవ్యంగా జరిగేలా చూస్తున్నాం. ఒక డ్రెస్ కొనుగోలు చేస్తే ఆ మొత్తంతో ఆ కళాకారుల ఇల్లు నెలంతా ఏ ఇబ్బంది లేకుండా గడిచిపోతుంది. భవిష్యత్తు తరాలు ఆ కళావైభవాన్ని సొంతం చేసుకోవాలన్నదే నా కల. చాలావరకు సేకరించే కాటన్ ఫ్యాబ్రిక్ ఐవరీ, గ్రే కలర్ వే ఎంచుకుంటాం. కొన్నింటికి మాత్రం నేచురల్ రంగులతో డైయింగ్ ప్రక్రియ ఉంటుంది. వ్యర్థాలను నివారిస్తూ, పర్యావరణ అనుకూలమైన ఉత్పత్తులను వెలుగులోకి తీసుకురావాలన్నదే మా ప్రయత్నం తప్ప ఫాస్ట్ ఫ్యాషన్ పోటీ పరుగులో చేరం.

రాబోయే తరాలకు మన కళ

ప్రాచీన హ్యాండ్ వర్క్స్‌ని వదిలేస్తే అవి అంతే సులువుగా మరుగున పడిపోతాయి. క్రాఫ్ట్స్ క్లస్టర్స్ ఆఫ్ ఇండియాతో అనుబంధంగా వర్క్ చేస్తున్నాను కాబట్టి దేశంలోని హ్యాండ్లూమ్ క్లస్టర్స్‌తోనూ, ఈ మార్గంలో వచ్చే అంతరాలను పూడ్చేందుకు నిఫ్ట్‌లోని వివిధ కేంద్రాలతో అనుబంధంగా వర్క్ చేస్తున్నాను.

ఫ్యాబ్రిక్ సేకరణ, డిజైన్స్ సృష్టి, వ్యర్థాలు మిగలకుండా జాగ్రత్తపడటం అనేది ఓ సవాల్‌గా ఉంటుంది. కానీ, పర్యావరణ హితంగా, మనసుకు నచ్చిన పని చేస్తుండటం ఎప్పుడూ ఉత్సాహాన్ని ఇస్తుంది. అంతేకాదు, ఈ డిజైన్స్‌ని ఇష్టపడి కొనుగోలు చేసేవారి ద్వారా ప్రాణం పెట్టే కళాకారులకు ఉపాధి పొందేలా చేయడం మరింత సంతృప్తిని ఇస్తుంది'' అని వివరించారు ఈ డిజైనర్.

- నిర్మలారెడ్డి, సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

వంటిల్లు

ఇది పకోడీ కాలం

ఇది వర్షాకాలం. వాన చినుకులు పడుతుంటే... వేడి వేడి పకోడీలు తింటూ గరం గరం చాయ్ తాగుతూ ఉంటే ఎలా ఉంటుంది? ఏడాదంతా వర్షాకాలమే ఉంటే బావుణ్ణనిపిస్తుంది. ఇది వర్షాకాలం కాదు పకోడీల కాలం అనాలనిపిస్తుంది.



పోహా పకోడీ

కావలసినవి: అటుకులు– ఒకటిన్నర కప్పులు; బంగాళాదుంప– అర కప్పు (ఉడికించి చిదిమినది); కొత్తిమీర తరుగు – 2 టేబుల్ స్పూన్‌లు; పచ్చిమిర్చి తరుగు– టీ స్పూన్; మిరప్పొడి– టీ స్పూన్; చక్కెర – అర టీ స్పూన్; నిమ్మరసం – అర టీ స్పూన్; జీలకర్ర– అర టీ స్పూన్; ఉప్పు – అర టీ స్పూన్ లేదా రుచిని బట్టి; నూనె– వేయించడానికి తగినంత.

తయారీ: ● అటుకులను ఒక పాత్రలో వేసి (అటుకులు తేలేటట్లు) నిండుగా నీటిని పోసి కడిగి వడపోత గిన్నెలో వేయాలి ● నీరంతా కారిపోయిన తర్వాత తీసి వెడల్పు పాత్రలో వేసుకోవాలి. అందులో ఉడికించి చిదిమిన బంగాళాదుంప, కొత్తిమీర, పచ్చిమిర్చి, మిరప్పొడి, చక్కెర, జీలకర్ర, నిమ్మరసం, ఉప్పు వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమం అంతటినీ చిన్న నిమ్మకాయంత గోళీలుగా చేసుకోవాలి ● బాణలిలో నూనె వేడి చేసి, మరుగుతున్న నూనెలోఒక్కో గోళీని మెల్లగా వేయాలి. మంటను మీడియంలో పెట్టి దోరగా వేగనివ్వాలి. అన్నివైపులా ఎర్రగా వేగిన తర్వాత చిల్లుల గరిటతో తీసి టిష్యూ పేపర్ మీద వేస్తే పోహా పకోడీ రెడీ. వీటికి పుదీన చట్నీ లేదా టొమాటో కెచప్ మంచి కాంబినేషన్.

కార్న్ పకోడీ



కావలసినవి: స్వీట్ కార్న్ గింజలు– 2 కప్పులు; అల్లం వెల్లుల్లి పేస్ట్ – 2 టీ స్పూన్‌లు; జీలకర్ర– అర టీ స్పూన్; శనగపిండి– 3 టేబుల్ స్పూన్‌లు; బియ్యప్పిండి– 3 టేబుల్ స్పూన్‌లు; గరం మసాలా – అర టీ స్పూన్; ఉల్లిపాయ – ఒకటి (తరగాలి); పచ్చిమిర్చి – 2 (తరగాలి); కరివేపాకు – 2 రెమ్మలు; ఉప్పు – అర టీ స్పూన్ లేదా రుచిని బట్టి; పసుపు – పావు టీ స్పూన్; మిరప్పొడి– అర టీ స్పూన్; నూనె – వేయించడానికి తగినంత.

తయారీ: ● మొక్కజొన్న గింజలను కడిగి చిల్లుల పాత్రలో వేసి నీరు పోయే వరకు ఉంచాలి ● ఈ లోపు ఒక పాత్రలో నూనె మినహా పైన తీసుకున్నవన్నీ వేసి కలపాలి ● మొక్కజొన్న గింజల్లో గుప్పెడు గింజలను తీసి పక్కన పెట్టి మిగిలిన గింజలను మిక్సీలో కచ్చపచ్చాగా గ్రైండ్ చేయాలి. ఇప్పుడు పక్కన పెట్టిన గింజలను కూడా శనగపిండి మిశ్రమంలో వేసి కలపాలి ● బాణలిలో నూనె మరిగించి పకోడీ మిశ్రమాన్ని చేతిలోకి తీసుకుని వేళ్లతో కొద్దికొద్దిగా నూనెలో వేయాలి. దోరగా వేగిన తర్వాత తీసి టిష్యూ పేపర్ మీద వేస్తే వేడి వేడి కార్న్ పకోడీలు తినడానికి రెడీ. ఇలాగే పిండినంతటినీ చేసుకోవాలి.

సినిమా

మహేశ్‌బాబు గోల్డ్?



హీరో మహేశ్‌బాబు, దర్శకుడు రాజమౌళి కాంబినేషన్‌లోని సినిమా అంతర్జాతీయ స్థాయిలో రూపొందనున్న సంగతి తెలిసిందే. దీంతో ఈ సినిమా ప్రతి అప్‌డేట్ ప్రపంచవ్యాప్త సినీ ప్రేమికులకు ఆసక్తికరంగా అనిపిస్తోంది. తాజాగా ఈ సినిమాకు 'గోల్డ్' అనే టైటిల్‌ను మేకర్స్ పరిశీలిస్తున్నారనే టాక్ ఫిల్మ్‌నగర్‌లో బలంగా వినిపిస్తోంది. గతంలో 'మహారాజా', 'మహారాజ్' వంటి పేర్లు తెరపైకి వచ్చిన సంగతి తెలిసిందే. లేటెస్ట్‌గా 'గోల్డ్' టైటిల్ వినిపిస్తోంది. ఆఫ్రికన్ ఫారెస్ట్ అడ్వెంచరస్ బ్యాక్‌డ్రాప్‌లో సాగే ఈ సినిమా ప్రధాన కథాంశం ఓ నిధి వేట అనే వార్త ప్రచారంలోకి వచ్చింది. ఇప్పుడు ఈ సినిమాకు 'గోల్డ్' అనే టైటిల్‌ని పరిశీలిస్తున్నారనే వార్త రావడంతో నిధి నేపథ్యం కాబట్టి ఈ టైటల్‌నే ఖరారు చేస్తారనే చర్చ జరుగుతోంది. ఇక ఈ సినిమాకు సంబంధించిన స్క్రిప్ట్ వర్క్‌ను రచయిత విజయేంద్ర ప్రసాద్ పూర్తి చేశారని, హైదరాబాద్‌లో సెట్ వర్క్ జరుగుతోందని, జర్మనీలో కొంత చిత్రీకరణను ప్లాన్ చేశారని తెలుస్తోంది. షూటింగ్‌ను ఈ ఏడాదిలోనే ప్రారంభించాలనుకుంటున్నారు మేకర్స్.

పాఠాలు నేర్పినవారందరికీ ధన్యవాదాలు



● శ్రుతీహాసన్

హీరోయిన్‌గా పదిహేనేళ్ల విజయవంతమైన కెరీర్‌ని పూర్తి చేసుకుంటూ, ఇంకా అగ్రశ్రేణి హీరోయిన్ల జాబితాలో ఒకరిగా రాణిస్తుండటం అంటే అంత సులభమైన విషయం కాదు. ఈ లిస్ట్‌లో చాలా తక్కువమంది హీరోయిన్లు ఉంటారు. తాజాగా శ్రుతీహాసన్ పేరు ఈ లిస్ట్‌లో చేరింది. తండ్రి కమల్‌హాసన్ నటించిన ద్విభాషా (తమిళం, హిందీ) చిత్రం 'హే రామ్' (2000)లో చైల్డ్ ఆర్టిస్టుగా తొలిసారి స్క్రీన్‌పై కనిపించారు శ్రుతీహాసన్. చైల్డ్ ఆర్టిస్టుగా మరో సినిమా చేయలేదు కానీ.. 'హే రామ్' రిలీజైన తొమ్మిదేళ్లకు హిందీ చిత్రం 'లక్' (2009)తో కథానాయికగా కెరీర్‌ను ఆరంభించారు శ్రుతి. ఆ తర్వాత సూర్య 'సెవెన్త్ సెన్స్', ధనుష్ 'త్రీ', రామ్ చరణ్ 'ఎవడు', అల్లు అర్జున్ 'రేసుగుర్రం' రవితేజ 'క్రాక్' .. ఇటీవల చిరంజీవి 'వాల్తేరు వీరయ్య', ప్రభాస్ 'సలార్: సీజ్‌ఫైర్' వంటి చిత్రాలతో ప్రేక్షకులను మెప్పించారు శ్రుతి. నటిగా–గాయనిగా–సంగీత దర్శకురాలిగా... ఇలా మల్టీ టాలెంట్‌తో దూసుకెళుతున్నారు శ్రుతీహాసన్. కథానాయికగా పదిహేనేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా శ్రుతీహాసన్ స్పందిస్తూ – ''అప్పుడే పదిహేనేళ్లు పూర్తయ్యాయంటే నమ్మశక్యంగా లేదు. నేను పెరిగిన మ్యూజికల్ ఇండస్ట్రీలోనే ఇంతకాలం నేను ఉన్నందుకు చాలా సంతోషంగా ఉంది. నా మిగతా జీవితాన్ని కూడా ఇండస్ట్రీతోనే ముడివేస్తాను. ఇండస్ట్రీలో నాకు అందమైన పాఠాలు నేర్పినవారందరికీ ధన్యవాదాలు. అలాగే నన్ను ఆదరించిన ప్రేక్షకులు, నా అభిమానులకు థ్యాంక్స్. వీళ్లే లేకపోతే నేను ఇలా ఉండేదాన్ని కాదు'' అన్నారు. రజనీకాంత్ 'కూలీ', ప్రభాస్ 'సలార్: శౌర్యంగాపర్వం', అడవి శేష్ 'డెకాయిట్' చిత్రాల్లో నటిస్తున్నారు శ్రుతీహాసన్.

తనికెళ్ల భరణికి డాక్టరేట్



ప్రముఖ నటుడు, రచయిత, దర్శకుడు తనికెళ్ల భరణికి వరంగల్ ఎస్ఆర్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్‌ను ప్రకటించింది. తనికెళ్ల భరణి దాదాపు 800లకు పైగా సినిమాల్లో నటించి ప్రేక్షకుల్లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. 52 సినిమాలకు మాటలు అందించారాయన. 'సముద్రం' సినిమాకి ఉత్తమ విలన్‌గా, 'నువ్వు నేను' చిత్రానికి ఉత్తమ క్యారెక్టర్ ఆర్టిస్టుగా, 'గ్రహణం' చిత్రంతో ఉత్తమ నటునిగా, 'మిథునం' సినిమాకిగాను ఉత్తమ రచయిత–ఉత్తమ దర్శకునిగా నంది అవార్డులు అందుకున్నారాయన. ఇక ఆగస్ట్ 3న వరంగల్‌లో జరిగే యూనివర్సిటీ స్నాతకోత్సవంలో తనికెళ్ల భరణికి డాక్టరేట్‌ను ప్రదానం చేయనున్నారు.

మళ్లీ తల్లి కాబోతున్నాను



'ఏం పిల్లో ఏం పిల్లడో', 'బావ', 'పాండవులు పాండవులు తుమ్మెద, రభస, బ్రహ్మోత్సవం' వంటి సినిమాల్లో నటించిన ప్రణీత తెలుగు ప్రేక్షకులకు సుపరిచితురాలే. ఇక వ్యక్తిగత విషయానికి వస్తే... 2021 మే 30న వ్యాపారవేత్త నితిన్ రాజుతో ప్రణీత వివాహం జరిగింది. 2022 జూన్‌లో ప్రణీత ఓ పాపకు జన్మనిచ్చారు. కొన్ని నెలలు సినిమాలకు విరామం తీసుకున్నాక ఆమె కన్నడలో చేసిన ఒక సినిమా, మలయాళంలో చేసిన ఒక సినిమా ఈ ఏడాది విడుదలయ్యాయి. కాగా తాను రెండోసారి తల్లి కాబోతున్నట్లు పేర్కొన్నారు. 'రౌండ్ 2.. ఇప్పటి వరకూ నేను వాడిన పాంట్స్ ఇక నాకు ఫిట్ కావు'' అంటూ బేబీ బంప్ ఉన్న ఫోటోలను సోషల్ మీడియాలో షేర్ చేశారు ప్రణీత.

● ప్రణీత

హారర్... థ్రిల్



● ప్రియా భవానీ శంకర్

అరుళ్ నిధి, ప్రియా భవానీ శంకర్ జంటగా నటించిన తమిళ చిత్రం 'డీమాంటీ కాలనీ 2'. అజయ్ ఆర్. జ్ఞానముత్తు దర్శకత్వం వహించారు. విజయ సుబ్రహ్మణ్యన్, ఆర్.సి.రాజ్ కుమార్ నిర్మించిన ఈ చిత్రం ఆగస్టులో విడుదల కానుంది. రాజ్ వర్మ ఎంటర్‌టైన్‌మెంట్– శ్రీ బాలాజీ ఫిలింస్ తెలుగులో విడుదల చేస్తున్నాయి. ఈ చిత్రం ట్రైలర్‌ను దర్శకుడు రామ్ గోపాల్ వర్మ రిలీజ్ చేసి, 'ట్రైలర్ ఆసక్తిగా ఉంది. సినిమా హిట్టవ్వాలి' అన్నారు. కాగా అజయ్ ఆర్. జ్ఞానముత్తు దర్శకత్వంలో వచ్చిన 'డీమాంటీ కాలనీ'కి సీక్వెల్‌గా 'డీమాంటీ కాలనీ 2' రూపొందింది. ''హారర్ థ్రిల్లర్‌గా రూపొందిన చిత్రం ఇది. డీమాంటీ ఇంట్లో అనూహ్యమైన ఘటనలు జరుగుతుంటాయి. ఆ ఇంట్లో ఏం జరుగుతుందో తెలుసుకునేందుకు వెళ్లిన వారు చనిపోతుంటారు. ఇంతకీ ఆ ఇంట్లో ఉన్న ఆ శక్తి ఏంటి? చివరగా వెళ్లినవారు ఎలా ప్రాణాలు కాపాడుకున్నారు?' అనేది 'డీమాంటీ కాలనీ 2'లో ఆసక్తిగా ఉంటుంది'' అన్నారు మేకర్స్.

తెగబడవేమీ...



● రాజ్ తరుణ్, మాళ్వీ మల్హోత్రా

రాజ్ తరుణ్, మాళ్వీ మల్హోత్రా జంటగా ఏఎస్ రవి కుమార్ చౌదరి దర్శకత్వం వహించిన చిత్రం 'తిరగబడరసామీ'. మల్కాపురం శివకుమార్ నిర్మించిన ఈ చిత్రం ఆగస్ట్ 2న రిలీజ్ కానుంది. తాజాగా ఈ చిత్రం టైటిల్ సాంగ్‌ని రిలీజ్ చేశారు మేకర్స్. 'కత్తులు దిగనీ నెత్తురుతోని తడపర భూమి తెగబడవేమీ...' అంటూ సాగే ఈ పాటకి జేబీ సంగీతం అందించారు. సుద్దాల అశోక్ తేజ సాహిత్యం అందించిన ఈ పాటని సాయి చరణ్, లోకేశ్వర్ ఈదర, చైతు సత్సంగి పాడారు. ''యూత్‌ని ఆకట్టుకునే రొమాన్స్‌తో పాటు ఫ్యామిలీని ఆకర్షించే సెంటిమెంట్, మాస్‌ని అలరించే హై ఓల్టేజ్ యాక్షన్ అంశాలతో 'తిరగబడర సామీ' రూపొందింది. టీజర్, ట్రైలర్, పాటలు సినిమాపై క్యూరియాసిటీని పెంచాయి'' అని చిత్రబృందం పేర్కొంది.

రక్షించండి!



● 'ఫిర్ ఆయీ హసీన్ దిల్‌రుబ' పోస్టర్

తాప్సీ నటించిన రొమాంటిక్ థ్రిల్లర్ మూవీ 'హసీన్ దిల్‌రుబ' (2021) హిట్టయిన విషయం తెలిసిందే. విక్రాంత్ మెస్సీ మరో లీడ్ రోల్‌లో నటించిన ఈ సినిమాకు వినీల్ మాథ్యూ దర్శకత్వం వహించారు. ఈ చిత్రానికి సీక్వెల్‌గా 'ఫిర్ ఆయీ హసీన్ దిల్‌రుబ' రూపొందింది. సీక్వెల్‌లోనూ తాప్సీ, విక్రాంత్ మెస్సీ లీడ్ రోల్స్‌లో నటించగా, వినీల్ మాథ్యూయే దర్శకత్వం వహించారు. ఈ సినిమా ట్రైలర్‌ను రిలీజ్ చేశారు. 'నాతో కలిసి నువ్వు సినిమాకు వస్తావా?' 'నన్ను రక్షించండి... నా భర్త నన్ను చంపబోతున్నాడు' అనే డైలాగ్స్ ట్రైలర్‌లో ఉన్నాయి. ఈ చిత్రం ఆగస్టు 9 నుంచి నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ కానుంది.

సినిమా బాగుందని అంటారు



● మహేంద్రనాథ్

''సమాజంలోని ఒక అంశానికి వాణిజ్య అంశాలు జోడించి 'విరాజి' తీశాం. ఈ సినిమాలో మంచి కంటెంట్ ఉంది. సినిమా చూసిన ప్రతి ఒక్కరూ బాగుందని అంటారనే నమ్మకం ఉంది'' అని నిర్మాత మహేంద్రనాథ్ కూండ్ల అన్నారు. వరుణ్ సందేశ్ హీరోగా నటించిన చిత్రం 'విరాజి'. ఆద్యంత్ హర్ష దర్శకత్వంలో మహేంద్రనాథ్ కూండ్ల నిర్మించిన ఈ చిత్రం ఆగస్టు 2న విడుదల కానుంది. ఈ సందర్భంగా మహేంద్రనాథ్ మాట్లాడుతూ– ''వరలక్ష్మితో 'శబరి' సినిమా తర్వాత మా సంస్థలో నిర్మించిన రెండో చిత్రం 'విరాజి'. ఆద్యంత్ హర్ష చెప్పిన కథని అంతే బాగా తెరకెక్కించారు. వరుణ్ సందేశ్ అమెరికా నేపథ్యం ఉన్న వ్యక్తి. అతని డైలాగ్ డెలివరీ విధానం 'విరాజి'కి కలిసొచ్చింది. మా సినిమాని మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూటర్స్ వాళ్లు నైజాంలో రిలీజ్ చేస్తున్నారు'' అన్నారు.

ఏమైందో మనసే...



● పవన్, సాహిబా

'మెరిసే మెరిసే' చిత్ర దర్శకుడు పవన్ కుమార్ కొత్తూరి హీరోగా నటించి, స్వీయ దర్శకత్వంలో నిర్మించిన చిత్రం 'యావరేజ్ స్టూడెంట్ నాని'. స్నేహా మాలవ్య, సాహిబా భాసిన్, వివియా సంత్ హీరోయిన్లుగా నటించారు. శ్రీ నీలకంఠ మహదేవ ఎంటర్‌టైన్‌మెంట్స్ ఎల్ఎల్‌పీపై రూపొందిన ఈ చిత్రం పీవీఆర్ ఐనాక్స్ పిక్చర్స్ ద్వారా ఆగస్ట్ 2న విడుదల కానుంది. కాగా 'ఏమైందో మనసే' అంటూ సాగే ఈ చిత్రంలోని రెండో పాటను రిలీజ్ చేశారు. ఈ పాటకు కార్తీక్ బి. కొడకండ్ల సంగీతం అందించారు. కృష్ణవేణి మల్లవజ్జల సాహిత్యం అందించగా, శక్తి శ్రీ గోపాలన్ పాడారు.